
సాక్షి
గుంటూరు
సోమవారం । 4 । నవంబర్ । 2024



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. లాంచీస్టేషన్ నుంచి కొండకు వెళ్లిన వారి నుంచి రూ. 41 వేలు సమకూరింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 588 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు వదిలారు.



ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది.

న్యూస్‌రీల్

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల ప్రగతికి బాలోత్సవం దోహదపడుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవం –2024 బ్రోచర్‌ను ఆదివారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ వేర్వేరుగా ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14వ తేదీలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో ఈ వేడుక నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, కట్టా కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 65 విభాగాలలో పోటీ పడతారని వివరించారు. గత ఏడాది 175 పాఠశాలల నుంచి 8 వేల మంది హాజరయ్యారని, ఈ సారి 10 వేల మంది వస్తారని భావించి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, కమిటీ గౌరవాధ్యక్షుడు ఎంఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలు



మాచర్ల: కొత్తపల్లి గ్రామంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నాగార్జునసాగర్ 400 కేవీ సబ్‌స్టేషన్ చీఫ్ మేనేజర్ జెల్ల రాము ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఓరుగంటి చిన్నారెడ్డి మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు విజిలెన్స్‌పై అవగాహన నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. పవర్ గ్రిడ్ మేనేజర్ సుబోధ్‌కంత్ మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం, అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ మేనేజర్ రాము మాట్లాడుతూ.. కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటి ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీ–2024 నినాదంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌జీవో సభ్యులు బంగారయ్య, పవర్ గ్రిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మంగళగిరి: అక్రమంగా రవాణా చేస్తున్న గోవులను పోలీసులు కాపాడారు. జీవాలను గోశాలకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ... ఆదివారం తెల్లవారుజామున గోవులు తరలిస్తున్న లారీని విధులలో ఉన్న హోంగార్డు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు వంతెన వద్ద గోవులను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సురక్షితంగా నరసింహస్వామి గోశాలకు తరలించారు. అక్కడి నిర్వాహకులకు అప్పగించారు. గోవుల అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. ఎవరైనా ఇలా గోవులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

దుర్గమ్మకు గాజుల శోభ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక శుద్ధ విదియ (యమ ద్వితీయ)ను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం గాజులతో విశేషంగా అలంకరించారు. విశేష అలంకారంలో అమ్మను దర్శించి తరించేందుకు అశేష భక్తజనం ఇంద్రకీలాద్రికి తరలివచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, విశేష అలంకరణ, నిత్య పూజల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. రంగురంగుల గాజులతో అమ్మవారు దేదీప్యమానంగా వెలిగిపోతూ భక్తులను కరుణించారు. మూలవిరాట్‌తో పాటు అమ్మవారి ప్రధాన ఆలయం, మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని గాజులతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న ముత్తయిదువులకు ప్రసాదంగా గాజులను పంపిణీ చేశారు.

కోటప్పకొండపై కార్తిక రద్దీ







నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తిక మాసంలో స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, అభిషేక దర్శనాలు చేసుకున్నారు. ఆది, సోమవారాల్లో మూలవిరాట్ అభిషేకాలు నిలిపివేశారు. దీంతో అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. పొంగళ్లు పొంగించి స్వామి వారికి సమర్పించారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, మహానందీశ్వరుడు వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మెట్లపూజ చేసుకుంటూ కొండమీదకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది.

అమరావతికి పోటెత్తిన భక్తులు

అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన అమరావతిలోని అమరేశ్వరాలయానికి ఆదివారం తెల్లవారు జాము నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. తొలుత కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేసిన తర్వాత ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలతో శివకేశవులకు భక్తులు పూజలు చేశారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ దేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు, యాత్రికులు, భక్తులతో ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పాత, కొత్త మ్యూజియాలు, అమరేశ్వరాలయం, స్నానాల ఘాట్‌లు కళకళలాడాయి.



శాండ్ శాసనులు

- నదిలోకి కొబ్బరిమట్టలతో దారివేశామంటూ టోల్ వసూలు
- కూటమి నేతల దురాగతం
- నిలదీస్తే లోడింగ్ నిలిపివేత
- రోజుకు 400 ట్రాక్టర్లపైగా తరలింపు
- పట్టించుకోని అధికారులు

కృష్ణానది వద్ద వసూల్ రాజాలు



మున్నంగి వద్ద కృష్ణా నదిలో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

మున్నంగి(కొల్లిపర): కూటమి నేతలు ప్రజలపాలిట చండశాసనులుగా తయారయ్యారు. నది వద్ద ఇసుక తీసుకెళ్లే ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ప్రకటించినా కూటమి నేతల తీరు వల్ల భారీగా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లిపర మండలం మున్నంగి వద్ద నదిలో ఇసుక తీసుకెళ్లేందుకు ఏ ఇబ్బందీ లేకుండా చూస్తామని కొబ్బరి మట్టలను కొంతదూరం నదిలో పరిచి, ట్రాక్టర్ల రాకపోకలకు దారి వేశామని చెబుతూ టోల్ చార్జీల పేరిట ప్రతి ట్రాక్టర్‌కు రూ.400 వసూలు చేస్తున్నారు. దీంతోపాటు ఇసుక లోడింగ్ చేసే కూలీలకు రూ.600 ఇవ్వాల్సి వస్తోంది. మొత్తం లోడింగ్ పూర్తయ్యేసరికి వినియోగదారులు రూ.వెయ్యి సమర్పించుకోవాల్సి వస్తోంది.

వినియోగదారుల ఆవేదన

ఇటీవల వరకు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ప్రభుత్వానికి టన్నుకు రూ.250 చొప్పున మొత్తం 5 టన్నులకు రూ.1,250 చెల్లించి వినియోగదారులు ట్రాక్టరుపై ఇసుకను వారికి కావాల్సిన చోటుకు తరలించుకునేవారు. సొంత ట్రాక్టరైతే సరే, లేకుంటే రవాణా చార్జీలు చెల్లించేవారు. ఇప్పుడు ఉచిత విధానం అని ప్రకటించినా ఆచరణలో మాత్రం సాధ్యం కావటం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కూడా నదిలో లోడింగ్‌కు రూ.600, టోల్ చార్జీలకు రూ.400 కలసి మొత్తం రూ.1000 చెల్లిస్తున్నామని, మరింక ఉచిత ఇసుక ఏమిటని, గతంలో ట్రాక్టర్ లోడింగ్‌కు ఎంత ఖర్చు అవుతుందో ఇప్పుడు కూడా రూ.200 తక్కువగా అదే ఖర్చు అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నిస్తే లోడింగ్ నిలిపివేత

టోల్ చార్జీలేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే కూటమి నేతలు ఇసుక లోడింగ్ నిలిపివేస్తున్నారు. ఇక్కడ ఇసుక లోడింగ్ మున్నంగి, వల్లభాపురం గ్రామాలకు చెందిన వారికి మాత్రమేనని, మిగిలిన వారికి కాదని పేర్కొంటున్నారు. దీంతో తప్పక వినియోగదారులు వారు అడిగినంత సమర్పించుకుంటున్నారు. మున్నంగిలో రోజుకు సుమారు 400 ట్రాక్టర్లు లోడింగ్ అవుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.400 చొప్పున రోజుకు రూ.1.60 లక్షలు కూటమి నేతలు జేబులో వేసుకుంటున్నారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

స్వయంగా వచ్చి పరిశీలిస్తా...

ఉచిత ఇసుక పథకంలో నదిలో దారి ఖర్చుల పేరుతో వసూళ్ల విషయం ఇప్పుడే తెలిసింది. స్వయంగా వచ్చి పరిశీలించి తగిన ఆదేశాలు జారీచేస్తాం. ప్రభుత్వం స్థానిక అవసరాల కోసం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేదిలేదు. లోడింగ్ చేసినందుకు కూలీలకు మాత్రమే ప్రభుత్వం ఆదేశాల మేరకు లోబడి చార్జీలు చెల్లించాలి.

– వి.సంజన సింహ,
తెనాలి సబ్‌కలెక్టర్

అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

కొల్లిపర మండలం అన్నవరపు లంక గ్రామం సమీపంలో కృష్ణా నదిలో అక్రమంగా ఇసుక తరలించడానికి వచ్చిన టీడీపీ నాయకులు, ఇసుక దళారులను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం కొంత మంది టీడీపీ నాయకులు పొక్లెయిన్‌తో నదిలో ఇసుక తవ్వి లోడింగ్ చేసుకోవడానికి వాహనాలతో వచ్చారు. గమనించిన గ్రామపెద్దలు వెంటనే ఇక్కడ ఇసుక తవ్వకాలు ఎలా చేస్తారని నిలదీశారు. ఈ భూములు సొసైటీ, పట్టా భూములని, అనుమతులు లేకుండా తవ్వకాలు చేయరాదని స్పష్టం చేశారు. దీంతో వచ్చినవారు వెనుతిరిగి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు సిద్ధార్థ వెంటనే స్పందించి వీఆర్‌వో రామారావును ఘటన స్థలానికి పంపించారు. వీఆర్వో ఘటనాస్థలానికి వచ్చి ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని వీఆర్ఏకు చెప్పారు.



అక్రమంగా ఇసుక లోడింగ్ చేయటానికి వచ్చిన పొక్లెయిన్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావు



గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం (పీడీఎఫ్) అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావును బలపరుస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక, ప్రజా సంఘాలు ఒకే వేదికపైకి చేరాయి. ఆదివారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో ఆయా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2007లో శాసన మండలిని పునరుద్ధరించిన తరువాత ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ఏడుగురు ఎమ్మెల్సీలు పీడీఎఫ్‌గా ఏర్పడి, ప్రజా సంక్షేమం కోసం పని చేశారని చెప్పారు. 2007 నుంచి 2024 వరకు 13 మంది పీడీఎఫ్ తరఫున ఎన్నికై వివిధ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. రాజ్యాంగ నిర్మాతలు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ స్థానాలను ప్రత్యేక లక్ష్యంతో ఏర్పాటు చేశారని, ఆ లక్ష్యం దెబ్బతినే విధంగా కొన్ని రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.హనుమంతరావు, ఎం.కళాధర్, సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, నేతాజీ, ఇన్సూరెన్స్ ఉద్యోగ సంఘ నేత వీవీకే సురేష్, ఆలిండియా లాయర్స్ యూనియన్ నేత నర్రా శ్రీనివాసరావు, బ్యాంకు ఉద్యోగ సంఘ నేత సాంబశివరావు పాల్గొన్నారు.

‘ఈ ఈ’గో ఏల

- ఈఈల మార్పుపై ఎమ్మెల్యేల కినుక
- కొద్ది రోజుల క్రితం తూర్పు ఈఈని పశ్చిమకు, పశ్చిమ ఈఈని తూర్పుకు మార్చిన నగర కమిషనర్
- అభ్యంతరం తెలిపిన ప్రజాప్రతినిధులు
- బదిలీలు ఆపాలని కమిషనర్‌పై ఒత్తిడి
- పాతచోటకే వెళ్తామంటున్న ఈఈలు
- కమిషనర్‌ను అభాసుపాలు చేసేందుకు యత్నాలు!



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్ అధికారుల అంతర్గత బదిలీలపై తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు. ముఖ్యంగా ఈఈలు(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) మార్పుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లపైబడి పనిచేస్తున్న గుంటూరు తూర్పు ఈఈ కోటేశ్వరరావును పశ్చిమకు, పశ్చిమ ఈఈ సుందర్రామిరెడ్డిని తూర్పుకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బదిలీ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు కినుక వహించారు. ఈఈలను యధాతథ స్థానాల్లో కొనసాగించాలని ఒత్తిడి తీసుకొస్తున్నట్టు సమాచారం. దీనిపై కమిషనర్ పులి శ్రీనివాసులు మీకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఎమ్మెల్యేలకు చెప్పినట్టు తెలుస్తోంది.

అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న ఈఈలు

గుంటూరు నగరంలో నలుగురు ఈఈలు ఉండాల్సి ఉండగా.. ఈఈలు కొండారెడ్డి, శ్రీనివాస్ నెల్లూరు మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఉన్న ఈఈలు కోటేశ్వరరావు, సుందర్రామిరెడ్డిలు మాత్రం కూటమి ఎమ్మెల్యేలతో సిఫార్సు చేయించుకుని ఇక్కడే ఉండిపోయారు. ఇక్కడే ఉన్నాం కదా అని సంతోషపడుతుండగా కమిషనర్ అంతర్గత బదిలీ చేయడంతో డైలమాలో పడ్డారు. ఈస్ట్ ఈఈగా సుందర్రామిరెడ్డి, వెస్ట్ ఈఈగా కోటేశ్వరరావు విధుల్లో చేరినా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. నగర వాసులు సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ చెప్పిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికీ వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బినామీ కాంట్రాక్టర్లతో వర్కులు!

ఇంజినీరింగ్ సెక్షన్‌లో అధికారులు బినామీ కాంట్రాక్టర్లతో వర్కులు చేయించుకుంటున్నారనేది బహిరంగ రహస్యం. ఏళ్ల తరబడి ఒకే సీటులో పాతుకుపోవడంతో ఇప్పుడు అకస్మాత్తుగా జరిగిన బదిలీలు వారికి మింగుడు పడడం లేదని తెలుస్తోంది. దీంతో కమిషనర్‌ను అభాసుపాలు చేయాలని యత్నిస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృత్రిమ నీటి కొరత సృష్టించేందుకూ వెనుకాడడం లేదని తెలుస్తోంది. గతంలో కమిషనర్లుగా పనిచేసిన కాంతిలాల్‌దండే, అనురాధ, కీర్తి చేకూరిలనూ తాగునీటి సరఫరాలో అవాంతరాలు సృష్టించి అధికారులు ఇబ్బంది పెట్టిన సందర్భాలు లేకపోలేదని చెబుతున్నారు. ఇటీవల కుళాయి కనెక్షన్ల మంజూరులో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు రావడంతో కమిషనర్ పులి శ్రీనివాసులు నలుగురు ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేలను అడ్డంపెట్టుకుని ఇంజినీరింగ్ అధికారులు ఆడుతున్న ఆటకు కమిషనర్ ఎలా చెక్ పెడతారో వేచి చూడాలి.

పట్టభద్రులూ మూడు రోజులే గడువు

- కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుకు చివరి తేదీ 6
- పట్టభద్రుల్లో కొరవడిన అవగాహన
- నామమాత్రంగా దరఖాస్తులు
- అసిస్టేషన్ నిబంధనతో తలనొప్పి

ప్రత్తిపాడు: మీరు పట్టభద్రులా.. రానున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకుంటున్నారా..? అయితే సమయం లేదు మిత్రమా.. పట్టభద్రుల ఓటు నమోదుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. అర్హత ఉండీ ఓటు నమోదుకు దూరంగా ఉన్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. కానీ వారు రకరకాల కారణాలతో నమోదుకు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో 3,494 దరఖాస్తులు మాత్రమే అధికారులకు అందాయి. ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు కచ్చితంగా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ లేదా సమానమైన డిప్లమాను పూర్తి చేసి ఉండటంతోపాటు, 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఫాం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి ఓటు హక్కుకు సిఫార్సు చేస్తారు.

గెజిటెడ్ సంతకాల తలనొప్పిగా..

ఓటు నమోదు దరఖాస్తుకు జత చేసే సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్ల(ప్రొవిజినల్స్)పై కచ్చితంగా గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించాల్సి ఉంది. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు నకళ్లు పట్టుకుని గెజిటెడ్ అధికారుల వద్దకు వెళ్లి వారి నుంచి సంతకాలు తీసుకోవడం పట్టభద్రులకు కాస్తంత ఇబ్బందికరంగా మారింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పరిశీలన సమయంలో రకరకాల కారణాలను అధికారులు చూపిస్తుండటంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. వృత్తిరీత్యా, ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిర పడిన పట్టభద్రులు ఆన్‌లైన్‌లో తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు విచారణ సమయంలో నివాసాలను సందర్శించి, దరఖాస్తుదారు ఉంటేనే ఆమోదిస్తామని, చెబుతున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని ఓటర్లు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఓటు హక్కుకు ఏయే సర్టిఫికెట్లు కావాలో అవగాహన ఉండడం లేదు. డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, ఫొటో ఉండాలని, ప్రొవిజనల్‌పై గజిటెడ్ అధికారి అసిస్టేషన్ ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయాల్సిన ఫాం-18

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు

https://ceoandhra.nic.in
వెబ్ అడ్రస్‌ను సందర్శించాలి.

వెంటనే దరఖాస్తు చేసుకోండి



పట్టభద్రులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 6వ తేదీ వరకే సమయం ఉంది. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు విచారణ సమయంలో ఇంటి వద్దే ఉండి అధికారులకు సహకరించాలి.

– జి.కరుణకుమార్,
తహసీల్దార్, ప్రత్తిపాడు

కూటమి నేతల కుట్ర రాజకీయం

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు డైమండ్ బాబు ర్యాలీపై అక్కసు
- ఉద్దేశపూర్వకంగా వీఆర్వోతో ఫిర్యాదు చేయించి కేసు నమోదు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కూటమి నేతలు మరోసారి వైఎస్సార్ సీపీపై అక్కసు వెళ్లగక్కారు. శనివారం వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) ప్రమాణస్వీకారం గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మంగళదాస్‌నగర్‌కు ప్రదర్శనగా వెళ్లారు. భారీగా కార్యకర్తలు, ప్రజలు తరలిరావటంతో కూటమి నేతలకు కన్ను కుట్టినట్లుంది. అధికార పార్టీ నేతలు స్థానిక వీఆర్వో మంగమ్మతో బలవంతంగా పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు తెలుస్తోంది. పోలీసులూ కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారని, ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీ జరిపారని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒక మనిషిని ఢీకొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి పల్నాడు వాసి



సత్తెనపల్లి: జాతీయ స్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి పల్నాడు జిల్లావాసి ఎంపికైనట్లు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. ఆదివారం సత్తెనపల్లిలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడామైదానంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ మెన్ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు గోల్‌కీపర్‌గా షేక్ ఇర్ఫాన్ ఎంపికయ్యాడన్నారు. ఇర్ఫాన్‌ను పలువురు అభినందించారు. ఆయనతో పాటు సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ షేక్ మహ్మద్ రియాజ్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు.

సీపీఎం కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి



అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో సీపీఎం కార్యకర్తపై టీడీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎండ్రాయి గ్రామంలో సీపీఎం కార్యకర్తగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వృద్ధుడైన నండూరి వెంకటేశ్వరరాజుపై పాత కక్షల నేపథ్యంలో ఎండ్రాయి మెయిన్ రోడ్డుపై టీడీపీ వర్గీయులు గోరంట్ల నాని, గోరంట్ల నాగమల్లేశ్వరరావు రత్నాకర్ ప్రసాద్‌లు దాడిచేశారు. ఈ సంఘటనపై సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ వయస్సు రీత్యా గౌరవం ఇవ్వకపోగా అకారణంగా అసభ్యపదజాలంతో తిడుతూ రోడ్డు మీద పడేసి కొట్టటం దారుణమన్నారు. అధికారం ఉంది మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు. నిన్నుచంపేస్తామని బాధితుడిని బెదిరించారన్నారు.ఈ సంఘటన పై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలని నిందితులను అరెస్టు చేయాలన్నారు. బాధితుడు వెంకటేశ్వరరాజు స్థానిక 30 పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మాచర్ల ఎమ్మెల్యే బావమరిదిపై హత్యాయత్నం

- కారుతో ఢీకొట్టి హతమార్చేయత్నం
- ఆర్థిక లావాదేవిల వల్లనే వివాదం
- రెండు వర్గాలు ఒకే పార్టీకి చెందిన వారే
- కేసు నమోదు చేసిన పోలీసులు

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): ఆర్థిక లావాదేవిల నేపథ్యంలో పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బావమరిది రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై గుంటూరు పట్టాభిపురం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేట ప్రాంతానికి చెందిన గాడిపర్తి మాధవరావు పట్టాభిపురంలోని టెంపుల్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటాడు. శనివారం రాత్రి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బావమరిది పులుసు రామకృష్ణారెడ్డితో కలిసి రామకృష్ణ అనే మరో స్నేహితుడి వద్దకు ఇద్దరు వెళ్లారు. అదే ప్రాంతంలో నివాసం ఉండే సుబ్రమణ్యం అనే అతను వచ్చి రామకృష్ణారెడ్డితో వాగ్వాదానికి దిగాడు. నాపై కోర్టులో దావా వేస్తావా అంత మొగడివా అంటూ రామకృష్ణారెడ్డిని ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడి, ఈ రోజు ఎలాగైనా చంపేస్తానని తన బాకీ కూడా పూర్తిగా రద్దు అవుతుందని చెప్పి గొడవకు దిగాడు. అంతటితో ఊరుకోకుండా తన కుమారుడు రిషి రవిచంద్రకు ఫోన్ చేసి రామకృష్ణారెడ్డి దొరికాడని చెప్పి పట్టాభిపురం రావాలని చెప్పాడు. రవిచంద్ర సుమారు 15 మందిని తీసుకుని అక్కడికి చేరుకుని రామకృష్ణారెడ్డిపై దాడికి యత్నించాడు. రవిచంద్ర వెంట వచ్చిన వారు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మాధవరావు తమ్ముడు రాము ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేసే వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఘర్షణకు వచ్చిన వారు పరారయ్యారు. దీంతో మాధవరావు, రామకృష్ణారెడ్డి కారులో పోలీస్‌స్టేషన్‌కు బయలు దేరగా, వీరితో పాటు ద్విచక్రవాహనంపై వస్తున్న రామును సుబ్రమణ్యం కుమారుడు రిషి రవిచంద్ర, స్నేహితులతో కలిసి కారుతో ఢీ కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. రాముకు వాహనంపై నుంచి కిందపడి చిన్నపాటి గాయాలయ్యాయి. స్థానికులు అడ్డుకోవడంతో రిషి రవిచంద్ర తన గ్యాంగ్‌తో పరారయ్యారు. మాధవరావు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు వాగ్వివాదం

మాచర్ల ఎమ్మెల్యే బావమరిది రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నంకు పాల్పడిన సుబ్రమణ్యం తరఫున పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ వద్దకు ఆదివారం రాత్రి టీడీపీ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు చేరుకున్నాడు. పోలీస్‌స్టేషన్ బయట మాచర్ల ఎమ్మెల్యే బావమరిదిపై దుర్భషలాడాడు. రామకృష్ణారెడ్డితో వచ్చిన వారికి ఎమ్మెల్యే అనుచరుడి మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. దీన్ని గమనించిన పట్టాభిపురం పోలీసులు స్టేషన్ బయట వాగ్వివాదం జరుగుతుందని తెలుసుకుని బయటకు వచ్చి ఇరువర్గాలకు సర్ది చెప్పారు. దీంతో పశ్చిమ ఎమ్మెల్యే అనుచరుడు స్టేషన్ వద్ద నుంచి వెళ్లిపోయాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేటపాలెం: మోటార్ బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి మృతి చెందాడు. పందిళ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కడవకుదురు చెందిన మురకిపూడి అబ్రహం రోజూ కూలీ పని కోసం చీరాల వెళ్లి వస్తుంటాడు. రోజూ మాదిరిగా వెళ్లి తిరిగి సాయం కాలం ఇంటికి చేరుకున్నాడు. ఆ తరువాత గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో మోటార్ బైక్‌పై పందిళ్లపల్లి వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలో మోటార్ బైక్ పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడా లేదా ఏదైనా వాహనం ఢీకొట్టి వెళ్లిందా అనేది తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

దీపావళి నాడు జరిగిన దాడి కేసులో నలుగురి అరెస్ట్

- త్వరలో అందరిపై రౌడీషీట్లు తెరుస్తాం
- మిగతా వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు
- ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): దీపావళి పండుగ రోజున జరిగిన కొట్లాటలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం ఇన్నర్‌రింగ్‌రోడ్డు శకుంతలనగర్ రెండో వీధిలోని జేసీహెచ్ ప్యారడైజ్-2 అపార్ట్‌మెంట్‌లో 104వ ఫ్లాట్‌లో గుదిబండ్ల సోనియా ఉంటున్నారు. గురువారం రాత్రి సోనియా దీపాలు పెట్టగా, ఆమె కుమారుడు అవినాష్, స్నేహితుడు జయదేవ్ కింద టపాసులు పేల్చారు. కాల్చిన టపాసులు ఎదురుగా ఉన్న జేఎస్ఎస్ఆర్ నివాసంలో పడ్డాయి. టపాసులు తన యజమాని ఇంట్లో పడటంపై కంకర నరేంద్రరెడ్డి డ్రైవర్ బాపట్ల జిల్లా పర్చూరు ఇందిరాకాలనీ వాసి వరగాని వెంకటేశ్ అలియాస్ వెంకట్ అవినాష్‌ను అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కంకర నరేంద్రరెడ్డి, అగవతరప్పాడు గ్రామానికి చెందిన వై.సాయిప్రకాష్, ఎ.శివయ్య, నరేంద్రరెడ్డి తనయుడు రిషికేష్‌రెడ్డి తదితరులు అవినాష్‌పై దాడికి పాల్పడ్డారు. దీనిపై అవినాష్ తల్లి సోనియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం వెంగళాయపాలెంలో నరేంద్రరెడ్డి, వి.వెంకటేశ్, వై.సాయిప్రకాష్, ఎ.శివయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. త్వరలో వీరందరిపై రౌడీషీట్‌లు తెరుస్తామని ఎస్పీ చెప్పారు. మిగతా వారిని త్వరలోనే పట్టుకుంటామని వివరించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ మల్లికార్జునరావు, నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్ పాల్గొన్నారు.

పోలీసులపై కూటమి నేతల ఒత్తిడి!

ఈ కేసులో పోలీసులపై కూటమి నేతల ఒత్తిడి పని చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైనుంచి వచ్చిన ఆదేశాలు తూ.చ. తప్పంకుడా అనుసరించారని అరెస్టులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగితే ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకుని నిష్పాక్షికంగా కేసులు నమోదు చేయడం ఆనవాయితీ. ఈ కేసులో అటువంటిది కనిపించలేదు. ఒక వర్గం వైపునే పోలీసులు మక్కువ చూపినట్టు కనిపిస్తోంది. కూటమి నేతల ఒత్తిడి వల్ల సోనియా ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశారనే వాదన వినిపిస్తోంది. నిందితులపై పలు సెక్షన్లతోపాటు రౌడీషీట్‌లు తెరుస్తామని, త్వరలో పీడీ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అవతల వర్గం జరిపిన దాడిలో నరేంద్రరెడ్డికి గాయాలయ్యాయని ఆయన భార్య లక్ష్మి చెబుతోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను బలవంతంగా తీసుకెళ్లిన పోలీసులు అరెస్టు చూపారని ఆరోపిస్తోంది. నరేంద్రరెడ్డి చేతికి పెట్టిన సూది తొలగించి విలేకరుల సమావేశంలో ప్రత్యక్షపరచడం లక్ష్మి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇటీవల పలు కేసుల్లో అరెస్టు చూపినప్పుడు నిందితులను విలేకరుల సమావేశంలో హాజరుపరచట్లేదు. అయితే ఈ కేసులో నలుగురి ముఖాలకు నల్ల కవర్లు చుట్టి విలేకరుల సమావేశంలో హాజరుపరిచారు.

హోరాహోరీగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



బరువులు ఎత్తుతున్న లిఫ్టరు



విజేతలు జయసాయికృష్ణ, ఎం.పావనితో నిర్వాహకులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ అంతర జిల్లాల (అండర్-17) బాలబాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు రెండోరోజైన ఆదివారం కొనసాగాయి. పోటీల్లో 55 కిలోల బాలుర విభాగంలో గుంటూరు జిల్లాకు చెందిన జి.జయసాయికృష్ణ స్నాచ్‌లో 60 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కిలోలతో సహా మొత్తం 150 కిలోలతో ప్రథమ స్థానం సాధించాడు. కడప, విశాఖకు చెందిన లిఫ్టర్లు ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచారు. బాలికల 40 కిలోల విభాగంలో పశ్చిమ గోదావరి, 45 కిలోల విభాగంలో తూర్పుగోదావరి లిఫ్టర్లు ప్రథమస్థానంలో నిలిచారు. ఈ పోటీలకు ఎస్.కోటేశ్వరరావు, సీహెచ్ గోపీనాథ్, ఎ.వెంకటరామిరెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగశిరీష, వ్యాయామ అధ్యాపకుడు రమేష్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఎం.రవికుమార్ పర్యవేక్షించారు.

వరదలకు పాడైన మోటార్లకు నష్టపరిహారం ఇవ్వాలి



కౌలు రైతులతో మాట్లాడుతున్న మాగంటి హరిబాబు

తాడేపల్లి రూరల్: ఆగస్టులో వరదల ముంపునకు గురై పాడైన ఇంజిన్ ఆయిల్ మోటార్లు, మోటార్ పంపు సెట్లను నమోదు చేసి రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు కౌలు రైతులను కలిసి వరద ముంపుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. హరిబాబు మాట్లాడుతూ కృష్ణానది వరద ముంపులో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొందరికే నష్టపరిహారం చెల్లించిందని విమర్శించారు. తక్షణమే రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం నాయకులు బొప్పన గోపాలరావు, మేడూరి పాములు, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు పల్లపాటి సుబ్బారావు, పోకల శంకర్, ధనేకుల వేణు, నారంశెట్టి శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న మంజుల

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో హోం హాల్‌లో ఉద్యమ అధ్యయన తరగతులు ఆదివారం జరిగాయి. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.కోట్లలో నిలిచాయని పేర్కొన్నారు. వాటిని సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల పెండింగ్ డీఏలను ఎప్పుడు విడుదల చేసేది ప్రభుత్వం చెప్పాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు పనిభారంగా మారిన యాప్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అపార్‌లో వస్తున్న ఇబ్బందులు తొలగించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగవరప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్.జిలాని, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌ఖలీద్, ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదం జరిగిన దృశ్యం

తెనాలిరూరల్: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. తెనాలి మండలం నందివెలుగు-అత్తోట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం కొల్లిపర వైపు నుంచి వస్తున్న ఆటోను ఎదురుగా మితిమీరిన వేగంతో వస్తున్న కారు ఢీ కొట్టడంతో ఒకే కటుంబానికి చెందిన వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. కొల్లిపరకు చెందిన ఎం.ధన కిషోర్ భార్య దేవరాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి వెళ్లేందుకు తెనాలి రైల్వేస్టేషన్‌కు ఆటోలో బయలుదేరారు. నందివెలుగు పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ఎదురుగా మితిమీరిన వేగంతో వచ్చిన కారు అదుపుతప్పి వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు ధన కిషోర్, దేవరాణి, వారి కుమారుడు విజయ భాను, ఆటో డ్రైవర్ శ్రీధర్‌కు గాయాలయ్యాయి. కిషోర్ కుమార్తె క్షేమంగా బయటపడింది. స్థానికులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కారు మితిమీరిన వేగంతో వచ్చి తమ ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిల్డింగ్‌పై నుంచి జారిపడి కూలీ మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

అద్దంకి రూరల్: బిల్డింగ్ పైన నున్న వేస్టును కిందకు పోస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం అద్దంకిలో చోటు చేసుకుంది. మృతుడి భార్య ఫిర్యాదుతో ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బీసీ బాలుర వసతి గృహం వద్ద నివాసం ఉంటున్న తోమట్ల పవన్ కుమార్ (38) కూలీపనులు చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం స్థానిక రంగారావు ప్రయివేటు వైద్యశాలలో డాబాపైన వాటర్ ట్యాంక్ పగలకొట్టే పనికి వెళ్లాడు. పనిలో భాగంగా సాయంత్రం వేస్టు డస్ట్‌ను పైనుంచి కింద ఉన్న ట్రాక్టర్‌లోకి పోస్తున్నారు. ఈ క్రమంలో జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య అంజలి అక్కడికి చేరుకుని భోరున విలపించింది.

గురువుల పాత్ర ఎనలేనిది


- ఎన్ఆర్ఐ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి
- వైభవంగా సర్రాజు అవార్డు ప్రదానోత్సవం



డాక్టర్ శ్రీనివాసరెడ్డితో అవార్డు గ్రహీతలు, సర్రాజు బాలచంద్ర తదితరులు

గుంటూరు వెస్ట్: ప్రతి వ్యక్తి జీవితంలోనూ గురువుల పాత్ర ఎనలేనిదని, గురువుల వల్లే తాను ఉన్నతుడిగా ఎదగగలిగానని ప్రముఖ కార్డియాలజిస్ట్, ఎన్ఆర్ఐ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో 'యశస్వి' సర్రాజు శ్రీవేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను ఉన్నత స్థితిలో అమెరికాలో స్థిరపడడంలో సర్రాజు వేణుగోపాలరావు మాస్టారి పాత్ర ఎంతో ఉందన్నారు. ఉన్నత విలువలతో కులమతాలకు అతీతంగా అందరు విద్యార్థులను తన బిడ్డల్లా భావించి పుస్తక పాఠాలతోపాటు జీవిత పరమార్థాన్ని ఆయన వివరించిన తీరు ఎంత చెప్పినా తక్కువేనని కొనియాడారు. సంస్కృతి సంస్థ వ్యవస్థాపకులు సర్రాజు బాలచంద్ర మాట్లాడుతూ తమ జీవితాల్లో గురువుగా, తండ్రిగా వేణుగోపాలరావు పాత్ర ఎంతో ఉందన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఏటా విద్యా, కళలు, సాంస్కృతిక, సంగీత రంగాలకు చెందిన వారిని సత్కరిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఎందరో స్నేహితులు, శ్రేయోభిలాషులు సహకరిస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీతలు ప్రకాశం జిల్లా రుద్రవరం గ్రామం సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యయుడు ఉన్నం జ్యోతివాసు, కవి, గాయకుడు, గేయ రచయిత, తెలుగు పండితుడు ఖమ్మం జిల్లా గోళ్ళపాడు జెడ్పీ హైస్కూల్ అసిస్టెంట్ మేడగాని శేషగిరిరావులకు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, సర్రాజు బాలచంద్ర, కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన మోదుగుల రవికృష్ణ, ప్రజా గాయకుడు రమణ తదితరులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ముప్పా శ్రీనివాసరావు, సర్రాజు బాలచంద్ర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాలికల విభాగంలో తలపడుతున్న జట్లు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, డీఎస్ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. గత రెండురోజులుగా జరిగిన పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జిల్లాల జట్లు వివరాలను స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. అండర్-14 బాలికల విభాగంలో తూర్పుగోదావరి, కర్నూలు, విశాఖ, అనంతపురం, పశ్చిమ గోదావరి, గుంటూరు, కృష్ణా, చిత్తూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనున్నాయి. అలాగే బాలుర విభాగంలో తూర్పుగోదావరి, చిత్తూరు, విశాఖ, పశ్చిమగోదావరి, అనంతపురం, నెల్లూరు, కృష్ణా, కర్నూలు జట్లు తలపడనున్నాయి. పోటీలకు పరిశీలకునిగా కె.కృష్ణారెడ్డి (పశ్చిమ గోదావరి) వ్యవహరిస్తుండగా,వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి రావు, శ్రీనివాసులు, శివలక్ష్మి, శివపార్వతి, గౌస్ తదితరులు సహకరిస్తున్నారు.

గాయపడిన యువకుడు మృతి

అద్దంకి రూరల్: అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై అద్దంకి సమీపంలో బైకుతో డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలైన యువకడు ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు. వివరాలు.. అద్దంకి పట్టణంలోని దామావారి పాలెంకు చెందిన వేముల ప్రసన్నబాబు (39) గత నెల 31వ తేదీ రాత్రి బుల్లెట్ బైకుపై శింగరకొండ నుంచి అద్దంకికి వస్తుండగా మార్గమధ్యంలో కూకట్ల కన్వెన్షన్ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన ప్రసన్నబాబు ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం, భార్య ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదు చేశారు.

విద్యార్థి మృతదేహం వెలికితీత

అద్దంకి రూరల్: అద్దంకిలోని బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలో దూకి శనివారం ఆత్మహత్యకు పాల్పడిన ఇంటర్ విద్యార్థి దాట్ల దుర్గాప్రసాద్(18) మృతదేహాన్ని ఆదివారం వెలికితీశారు. వివరాలు.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ 19వ లైన్‌లో నివాసం ఉంటున్న దాట్ల శ్రీనివాసరావు కుమారుడు దాట్ల దుర్గాప్రసాద్ అద్దంకిలోని ప్రయివేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల నుంచి తోటి విద్యార్థులతో కలసి విహారయాత్రకు వెళ్లాలని తల్లిదండ్రులను అడగ్గా వారు వద్దు అన్నారు. దీంతో మనస్తాపానికి గురై గుండ్లకమ్మలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి స్నేహితులు భావిస్తున్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఒంగోలు నుంచి వచ్చిన రెస్క్యూటీమ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేశారు.

విధి నిర్వహణలో పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ మృతి

నాగాయలంక: గ్రామంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్(ఎన్‌హెచ్ఎం)గా చేస్తున్న పులివర్తి కల్యాణి(34) విధి నిర్వహణలోనే మృతి చెందింది. స్థానిక పీహెచ్‌సీలో 2021 నుంచి స్టాఫ్‌నర్స్‌గా బాపట్ల జిల్లాకు చెందిన కల్యాణి పని చేస్తున్నారు. ఆమె ఏడాదిగా కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతూ సెలవులో ఉన్నారు. డయాలసిస్ తర్వాత కోలుకున్న ఆమె నెల రోజుల నుంచి ఆస్పత్రి విధులకు వస్తున్నారు. ఈ క్రమంలో నవంబరు 1వ తేదీ రాత్రి షిఫ్ట్ డ్యూటీ చేస్తూ 11 గంటల సమయంలో కుప్పకూలి పడిపోయారు. పీహెచ్‌సీ డాక్టర్ ఇంద్రకుమార్‌రెడ్డి, సిబ్బంది ఆమెను మెరుగైన చికిత్స కోసం అవనిగడ్డ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచినట్లు వైద్యాధికారి డాక్టర్ కె.శివరామకృష్ణ ధ్రువీకరించారు.